క్లుప్తంగా

అదనపు కలెక్టర్‌కు వినతి

రఘునాథపాలెం: ఖమ్మం మీదుగా నాగపూర్ -అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం సరికాదని బాధిత రైతులు, భూమి యజమానులు గురువారం అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డికి కలిసి విన్నవించారు. విచారణ చేసి న్యాయం చేయాలని బాధిత రైతులు నాగండ్ల శ్రీధర్, తక్కెళ్లపాటి భద్రయ్య, బొంతు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఏఎస్‌ఆర్ శాంతినగర్ జూనియర్ కళాశాల విద్యార్థిని దేవి శ్రీప్రసన్న ను గురువారం 24వ డివిజన్ కార్పొరేటర్ కమర్తపు మురళి అభినందించారు. రీజినల్ స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

శివుడి విగ్రహం ఆవిష్కరణ

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు గ్రామం శ్మశానవాటికలో గ్రామానికి చెందిన కాంపాటి బాబురావు, ప్రమీల దంపతులు ఏర్పాటు చేసిన శివుడి విగ్రహాన్ని గురువారం ప్రారంభించారు. అంతిమ యాత్ర రథం, మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు, పేద విద్యార్థులకు సాయం చేయడం అభినందనీయమని బాబురావు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆనందరావు, రామయ్య, యాకయ్య, నిర్మల్‌రావు, శరత్‌బాబు, వెంకన్న, అప్పయ్య, ఉపేందర్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే చోరీకి యత్నం

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ఓ ఇంట్లో గురువారం మధ్యాహ్నం ఇద్దరు వ్యక్తులు చోరీకి యత్నించారు. ప్రధాన సెంటర్‌కు కూతవేటు దూరాన ఇంట్లో చోరీ చేసేందుకు ఇద్దరు వ్యక్తులు గోడ దూకుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన ఇంట్లోని వారు కేకలు వేయడంతో స్థానికులు వారిని పట్టునేందుకు యత్నించగా పారిపోయారు. ఈక్రమాన రాజేశ్వరపురానికి చెందిన ఓ యువకుడు వద్ద పని ఉందంటూ ఫోన్ తీసుకుని మాట్లాడారు. దీంతో పోలీసులు సదరు యువకుడిని అదుపులోకి తీసుకుని విచారించారు.

రమణగుట్ట వాసి అరెస్ట్

ఖమ్మంక్రైం: తరుచూ గొడవలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న ఖమ్మంలోని రమణగుట్ట ప్రాంతానికి చెందిన సంకినేని మహేష్‌ను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు. ఈనెల 22న దివ్యాంగుల కాలనీలో పాత గొడవలను మనస్సులో పెట్టుకుని ప్రభాకర్ అనే వ్యక్తిపై మహేష్, ఆయన స్నేహితులు దాడి చేశారని, గతంలోనూ అతడిపై ఏడు కేసులు ఉన్నందున రిమాండ్‌కు తరలించామని సీఐ వెల్లడించారు.

ఫార్మసీ డే వేడుకలు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గురువారం ఫార్మసీ డేను ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎం.నరేందర్ కేక్ కట్ చేసి ఫార్మసిస్టులకు శుభాకాంక్షలు తెలిపి ఫార్మసిస్టుల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ రాంబాబు, ఎల్.కిరణ్‌కుమార్, నందగిరి శ్రీనివాస్, రవికిశోర్, ఫార్మసిస్టులు పాల్గొన్నారు.

'పులిపాటి' విద్యాసంస్థలకు అవార్డు



పులిపాటి ప్రసాద్‌ను సన్మానిస్తున్న వెంకయ్యనాయుడు, పక్కన కేటీఆర్ తదితరులు

ఖమ్మం సహకారనగర్: ఓ టీవీ చానల్ ఉత్తమ విద్యాసంస్థలకు అవార్డులు ప్రకటించగా.. ఖమ్మంలోని పులిపాటి ప్రసాద్ విద్యాసంస్థలకు జాబితాలో చోటు దక్కింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, ఎంపీ ఈటల రాజేందర్, సినీ దర్శకుడు హరిశంకర్, ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ నాగేశ్వరరెడ్డి తదితరుల చేతులమీదుగా అవార్డు అందుకున్నట్లు విద్యాసంస్థల చైర్మన్ పులిపాటి ప్రసాద్ అవార్డు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

ఏఐ సమ్మిట్‌కు 'ఎస్‌బీఐటీ' విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: సర్వీస్ నౌ సంస్థ హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి ఏఐ సమ్మిట్‌లో తమ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారని ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ సంస్థ అమెరికాలో సర్వీస్ నౌ ఆటోమెటెడ్ బిజినెస్ వర్క్‌ఫ్లోల సృష్టి, నిర్వహణ వ్యవహారాలతో పాటు ఐటీ రంగ సర్వీస్‌ను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ధాత్రి, సంస్థ నేషనల్ లీడ్ జి.భాస్కర్, సీనియర్ ప్రోగ్రామ్ స్పెషలిస్టు జాషువా, ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

బకాయి.. పేరుకుపోయి

నిర్లిప్తతలో కేఎంసీ రెవెన్యూ విభాగం

- నామమాత్రంగా పన్నుల వసూళ్లు
- కలెక్టర్ ఆదేశించినా కనిపించని ఫలితం
- రెండు నెలల్లో రూ.కోటి మాత్రమే ఆస్తి పన్ను వసూలు
- పంపు పన్నులపై పట్టింపు కరువు



ఖమ్మంమయూరిసెంటర్: నగర ప్రజలకు మెరుగైన సౌకర్యాలు, నాణ్యమైన పౌర సేవలు అందించేందుకు కేఎంసీపై ప్రతి నెలా కోట్ల రూపాయల భారం పడుతోంది. ఈ ఖర్చంతా ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు, ప్రజలు చెల్లించే పన్నుల ద్వారానే బరిస్తున్నారు. అయితే ఇటీవల ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు లేకపోవడం, అటు ఆర్థిక సంఘం నుంచి వచ్చే నిధులు నిలిచిపోవడంతో ఖమ్మం నగర పాలక సంస్థ ఆర్థిక భారం అంతా ప్రజల నుంచి వచ్చే పన్నులపైనే ఆధారపడి ఉంది. ప్రజలు చెల్లించే పన్నుల్లో ప్రధానమైనది ఆస్తి పన్ను. అయినా దీన్ని వసూలు చేయడంలో కేఎంసీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. గతంలో మాదిరిగా కాకుండా ఈ ఏడాది ఇప్పటి నుండే పన్నులు వసూలు చేయాలని స్వయంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కేఎంసీ రెవెన్యూ విభాగ అధికారులను ఆదేశించినా.. వారు ఆ ఆదేశాలను పెడచెవిన పెట్టినట్లుగానే కనిపిస్తుంది. జూలై 25న జిల్లా కలెక్టర్ కేఎంసీలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాత బకాయిలతో కలుపుకుని ఈ ఏడాది పన్నులను ఆ రోజుకు రూ.12.66 కోట్లు వసూలు చేసినట్లు చూపించారు. ఆ తర్వాత ఈ రెండు నెలల్లో ఇప్పటి వరకు రూ.1.30 కోట్లు మాత్రమే వసూలు చేసినట్లు తెలుస్తోంది. దీనిని పరిశీలిస్తే రెవెన్యూ విభాగం అధికారులు పెద్దగా పని చేసినట్లుగా కనిపించడంలేదనే చర్చ ఉంది.

నామమాత్రంగా వసూళ్లు..

గత రెండు మూడేళ్లల్లో ఖమ్మం నగర పాలకసంస్థలో ఆస్తి పన్నులను భారీగానే వసూలు చేస్తున్నారు. ఎన్నికలు, సర్వేలు, ఇతర కారణాలతో ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు పన్నులను వసూలు చేస్తూ వచ్చారు. ఆ సమయంలో తలెత్తే సాంకేతిక కారణాలతో కేఎంసీకి దక్కే పలు ప్రయోజనాలను కోల్పోయే పరిస్థితి ఎదురైంది. వీటిని దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది ఇప్పటి నుండే పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ గత సమీక్షలో ఆదేశించారు. కలెక్టర్ ఆదేశించే సమయానికి రెవెన్యూ విభాగంలో బిల్లు కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు పెద్ద సంఖ్యలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. సిబ్బంది భాగానే ఉన్నారు. ఇంత వరకు భాగానే ఉన్నా.. ఆ విభాగ అధికారులు పట్టించుకోకపోవడంతో సరైన ప్రణాళిక లేక ఆస్తి పన్నుల వసూళ్లు నామమాత్రంగానే జరిగాయన్న విమర్శలు ఉన్నాయి. 20 రెవెన్యూ డివిజన్లలో ఆర్ఐలు, బిల్లు కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు, వారి అసిస్టెంట్లు అంతా కలుపుకుని 50 మంది వరకు ఉన్నా రెండు నెలల్లో రూ.1.30 కోట్లు మాత్రమే వసూలు చేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బాధ్యతలు.. భారంగా

ఏ సంస్థ అయినా అక్కడ పని చేసే సిబ్బందికి అప్పగించే బాధ్యతలపై ప్రతి రోజు, వారానికోసారి సమీక్షిస్తే ఫలితాలు ఉంటాయి. కానీ కేఎంసీలో రెవెన్యూ విభాగంలో మాత్రం ఇది కనిపించడం లేదని తెలుస్తోంది. బిల్లు కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లకు పన్నుల వసూళ్ల బాధ్యతలు అప్పగించినా.. ఎవరెవరు రోజుకు ఎంత మేర పన్నులు వసూలు చేశారు, ఎంత పని చేశారనేది కూడా తెలుసుకోలేని స్థితిలో ఉన్నారనే చర్చ కూడా ఉంది. కలెక్టర్, కమిషనర్ చెప్పారని బకాయిదారులకు నోటీసులు ఇస్తున్న అధికారులు, వారి నుంచి పన్నులు వసూలు చేయడం మాత్రం ఆలోచన చేయకుండా వదిలేస్తున్నారు. దీని ఫలితంగా కలెక్టర్, కమిషనర్ ఆశించిన స్థాయిలో పన్నులు వసూలు కావడంలేదని తెలుస్తోంది.

పట్టించుకునేవారే లేరు..

నగరంలో ఆస్తి పన్నుల తర్వాత పంపు పన్నుల ద్వారా భారీగానే కేఎంసీకి ఆదాయం సమకూరుతోంది. గత ఐదేళ్లుగా నగరంలో పంపు పన్నుల బకాయిలు భారీగానే పేరుకుపోయినా వాటిని వసూలు చేయాలనే ఆలోచన ఎవరికీ లేదు. సంవత్సరానికి కనీసం రూ.12 కోట్లు పంపు పన్నులు వసూలు చేయాల్సి ఉంటుందని అధికారులే చెబుతుండడం గమనార్హం. కాని ఏడా రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లు మాత్రమే వసూలు చేస్తున్నారు. ఇది కూడా గత ఆర్థిక సంవత్సరంలోనే అత్యధికంగా రూ.3 కోట్లకు పైగా వసూలు చేసినట్లు తెలుస్తోంది. పంపు పన్నుల బకాయిలు గత ఐదేళ్లల్లో రూ.40 కోట్ల వరకు బకాయిలు వసూలు చేయాల్సి ఉందనే చర్చ అధికారుల్లో జరుగుతుంది. కాని అటు ఇంజనీరింగ్ అధికారులు, ఇటు రెవెన్యూ విభాగ అధికారులు దీనిపై చర్చించిన దాఖలాలు లేవు. ఇక మంచినీటి సరఫరా కోసం ప్రతి నెలా కేఎంసీ నుంచి రూ.50 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. ఖర్చు భారీగానే ఉన్నా.. ఆదాయం మాత్రం లేకపోవడం గమనార్హం.

ఆస్తి పన్నుల బకాయిలు, వసూళ్ల వివరాలు..

మొత్తం అసెస్‌మెంట్లు	ఆస్తి పన్ను లక్ష్యం	ఇప్పటి వరకు వసూలు
82,076	రూ.57.90 కోట్లు	రూ.14.30 కోట్లు

రూ.5లక్షల విరాళం అందించిన మంత్రి



నగదు అందజేస్తున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి/తిరుమలాయపాలెం: కూసుమంచిలో రామాలయ నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రూ.5లక్షల విరాళం అందజేశారు. ఈ నగదును గురువారం ఆలయ కమిటీ బాధ్యులు, గ్రామ పెద్దలకు అందజేయగా, వారు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం గ్రామంలో లోఓల్టేజీ విద్యుత్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి మండల కాంగ్రెస్ నాయకులు ఉస్నం రాజశేఖర్ తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించగా.. గురువారం ఏర్పాటు చేశారు. అదేవిధంగా తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లి గ్రామంలో కల్వరి మహిమా స్వరం చర్చి వృద్ధాశ్రమానికి పీఎస్ఆర్ ట్రస్టు ద్వారా రూ.25వేల నగదును గురువారం నిర్వాహకురాలు వసంతమ్మకు మంత్రి పొంగులేటి ఖమ్మం క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పోట్ల కిరణ్‌కుమార్, నాగండ్ల ప్రసాద్, దడిదల రమేష్, చిప్పరపల్లి రమేష్, తురక వేణు, తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

ఖమ్మంరూరల్: అకాల వర్షాలకు పత్తి, మిర్చి, వరి, పెసర పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బి.రమేష్ అన్నారు. మండలంలోని కస్నాతండా, తనగంపాడు గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నష్టపోయిన పంటల వివరాలను క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి ఎకరాకు కనీసం రూ.25వేలు పరిహారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ.50వేలు వరకు పెట్టుబడి పెట్టారని, ప్రభుత్వమే అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రతాపనేని వెంకటేశ్వర్లు, కొండం కరుణాకర్, బి.నాగేశ్వరరావు, ఎ.గురవయ్య, మారుతి ఉపేందర్, కార్తీక్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: వైరా బ్రిడ్జిపై టూ వీలర్‌తో వెళ్తున్న తమను వెనుక నుంచి కారు ఢీకొట్టడడంతో గాయాలపాలై స్పృహ కోల్పోయామని వైరాకు చెందిన ఇంటూరి ధనలక్ష్మి తెలిపారు. గురువారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. స్పృహకోల్పోయిన తమను అంబులెన్స్ డ్రైవర్ ప్రభుత్వ ఆస్పత్రికి కాకుండా ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లాడని, మా బ్యాగులో ఉన్న డబ్బులతో పాటు బంగారు వస్తువులు పోయాయని, అంబులెన్స్ డ్రైవర్‌పై అనుమానం ఉందన్నారు. వైద్యం చేయించుకోవడానికి రూ. 5లక్షలు ఖర్చయ్యాయని, అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి, తమను న్యాయం చేయాలని వేడుకుంది.

ఆర్థిక సాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 59వ డివిజన్ దానవాయిగూడెంకు చెందిన అగ్రివేతల చెంగయ్య ఇటీవల మృతిచెందాడు. గురువారం ఆయన దశదిన కర్మ సందర్భంగా మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి సూచన మేరకు కాంగ్రెస్ నాయకుడు చల్లా కృష్ణ మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.

వనహారం

తిరుమలాయపాలెం: మండలంలోని ఎదుళ్లచెరువు పరిధిలోని కాస్మిక్ వ్యాలీలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గురువారం వనహారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరంలో భాగంగా కాస్మిక్ వ్యాలీ రహదారి పక్కన ముళ్లపొదలను తొలగించి శ్రమదానం చేశారు. కాస్మిక్ వ్యాలీ బాధ్యులు సరోజ, కృష్ణారావు ఆధ్వర్యంలో యోగా, ధ్యానం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ పీఓ నారాయణరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

రఘునాథపాలెం: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు తుమ్మల యుగంధర్ అన్నారు. గురువారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలు, వర్గపోరు లేకుండా పార్టీకి నిర్ణయించిన అభ్యర్థులను గెలిపించాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారంలో ముందుండాలని, ప్రతీ గ్రామంలో పదిమంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసి గ్రామ సమస్యలను పరిష్కరించాలన్నారు. పార్టీ నిర్ణయించిన అభ్యర్థులకు మీరందరూ సహాయ సహకారాలు అందించాన్నారు. మండల పార్టీ కన్వీనర్ దీప్ల నాయక్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్‌చార్జ్ నూతి సత్యనారాయణ, మేయర్ పునుకొల్లు నీరజ, సాధు రమేష్‌రెడ్డి, వ్యవసాయ కమిటీ చైర్మన్ యారగర్ల హనుమంతరావు, మానుకొండ రాధాకిషోర్, రమేష్, చోటే బాబా, దీపక్‌చౌదరి, బాలగంగాధర్ తిలక్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

నివాళి

కూసుమంచి: మండలంలోని గోపాలరావుపేట గ్రామానికి చెందిన డీసీసీబీ మాజీ డైరెక్టర్ తల్లి ఇంటూరి భద్రమ్మ ఇటీవల మరణించారు. ఈమేరకు గురువారం నిర్వహించిన ఆమె దశదిన ఖర్మలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు కందాల ఉపేందర్‌రెడ్డి, బానోత్ చంద్రావతి, మాజీ డీసీసీబీ, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్లు కూరాకుల నాగభూషణం, ఆర్జేసీ కృష్ణ తదితరులు పాల్గొని భద్రమ్మ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు.

వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఖమ్మం మామిళ్లగూడెం: వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం చేయాలని ఏపీకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోకినపల్లి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు రేపాకుల శివలింగం అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలీలకు పనికి తగ్గ వేతనం అందడంలేదన్నారు. వ్యవసాయ కూలీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఇంటి స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. నవంబర్ 29, 30 తేదీలలో కామారెడ్డిలో జరిగే రాష్ట్ర ప్రథమ మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు బందెల వెంకయ్య, ఖమ్మం జిల్లా కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు, కంకణాల అర్జున్‌రావు, కూరాకుల నరసయ్య, సోమనపల్లి వెంకటేశ్వర్లు, గంట శ్రీనివాసరావు, రెంటాల యాదగిరి వీర్ల వెంకటఅప్పారావు, కేలోత్ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

రవాణా చార్జీలు చెల్లించాలి

నేలకొండపల్లి: మండలంలోని చెన్నారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించిన రైతులకు రవాణా చార్జీలు చెల్లించాల్సిన సొసైటీ ఇవ్వడం లేదని గురువారం సొసైటీ చైర్మన్ వందనం నాగేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ధాన్యం కేంద్రానికి తరలిస్తే బస్తాకు రూ.7 చొప్పున రైతులకు చెల్లించాల్సి ఉందని, ట్రాన్స్‌పోర్టుకు సంబంధించిన ధాన్యం దాదాపు 10 వేల టిక్కీలకు రావాల్సి ఉందన్నారు. కాగా, సొసైటీ సీఈఓ ఖాతాలో జమ అయిందని, ఆయన ఇటీవల మృతి చెందడంతో డబ్బులు చెల్లించలేదన్నారు. ఇకనైనా రవాణా చార్జీలు అందించాలని కోరారు. రైతు ప్రతినిధులు చింత నిప్పు సైదులు, కొక్కిరేణి నాగేశ్వరరావు, రామయ్య, వీర స్వామి, మస్తాన్, కె.వెంకయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి అలంకరణలు, పూజలు

శరన్నవరాత్రుల సందర్భంగా గురువారం ఆలయాలు, మండపాల్లో అమ్మవార్లకు నిర్వాహకులు వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మం మామిళ్లగూడెం: 49వ డివిజన్ రామాలయం వద్ద అమ్మవారిని దర్శించుకున్న మేయర్ నీరజ



ఖమ్మం అర్బన్: అల్లీపురంలో పూజలో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ హన్మంతరావు, తదితరులు



నేలకొండపల్లి: రాయగూడెంలో భక్తుల పూజలు

సంక్షిప్తంగా..

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందుకున్న వారితో ఎంపీ వద్దిరాజు

ఖమ్మంవైరారోడ్: అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి తన సిఫారసుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర గురువారం అందజేశారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో 12మందిని చెక్కులు అందజేసి మాట్లాడారు. కార్పొరేటర్లు తోట రామారావు, తోట వీరభద్రంతో పాటు పసుపులేటి నాసరయ్య, పగడాల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.20.23 లక్షల చెక్కులు..

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం మొత్తం 62 మందికి రూ.20,23,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు పంపిణీ చేశారు. మంత్రి శ్రీనివాసరెడ్డి చొరవతో చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, నంబూరి రామారావు, బొందయ్య, వెంకన్న, రామారావు, నరేష్, విజయ్‌బాబు, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి

ఖమ్మం మామిళ్లగూడెం/నేలకొండపల్లి: భారతీయ జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని గురువారం బీజేపీ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఖమ్మంలోని 55వ డివిజన్‌లో బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు వెంకటనారాయణ ఆధ్వర్యాన నిర్వహించగా.. డివిజన్ శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ బోయినపల్లి సురేష్‌గౌడ్ దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పించాక మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, ఖమ్మం బీజేపీ టూటౌన్ ప్రధాన కార్యదర్శులు కన్నెకంటి కృష్ణచారి, రుద్రగాని మాధవ్, రామయ్య, వెంకటేశ్వర్లు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే నేలకొండపల్లి లోని రామదాసు ధ్యాన మందిరంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్ ఆధ్వర్యాన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మన్నె కృష్ణారావు, భువనాసి దుర్గారావు, మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, సూరేపల్లి జ్ఞానరత్నం, షేక్ షరుద్దీన్, బాజా రామకృష్ణ, గోవిందరావు, మోహినుద్దీన్, గోపి, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

ఖమ్మంమయూరిసెంటర్: ఈ నెల 26న (నేడు) వీర నారీ చాకలి ఐలమ్మ, 27న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి జి.జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఎదురుగా ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద, 27న లకారం ట్యాంక్ బండ్ వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు ప్రజలు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.

'యూరియా పంపిణీలో విఫలం'

కామేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సకాలంలో యూరియా పంపిణీ చేయడంలో విఫలమైందని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ ఆరోపించారు. గురువారం జాస్తిపల్లి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. యూరియా కోసం రైతులు క్యూలో రోజుల తరబడి ఇబ్బందులు పడుతున్నారని, బతుకమ్మ చీరలు అందించకపోవడంతో మహిళలు మండిపడుతున్నారని చెప్పారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు మల్లెంపాటి శ్రీనివాసరావు, బత్తుల పుల్లయ్య, దేవండ్ల కృష్ణయ్య, ఎర్రబోయిన బసవయ్య, దిరిశాల నవీన్, కొరివి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థ టన్నెల్‌ను తొలగించాలి

ఖమ్మంఅర్బన్: కార్పొరేషన్‌లోని ఖానాపురం హవేలీ పరిధిలో 12వ డివిజన్ ఎన్ఎస్‌పీ మేజర్ కెనాల్‌పై ఉన్న అండర్ టన్నెల్ శిథిలావస్థకు చేరిందని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, హవేలి మండల కార్యదర్శి దొంగల తిరుపతిరావు డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం 12వ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టన్నెల్ శిథిలావస్థకు చేరడంతో డ్రెయినేజీ వ్యవస్థ స్తంభించి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ అండర్ టన్నెల్‌ను తొలగించి ఆర్‌సీసీ కల్వర్టును నిర్మించి సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిన్నింటి రమ్య, పోతురాజు వెంకటి, కత్తుల అమరావతి, జట్ల ఆనందరావు, గాలి అంజయ్య, తోట నాగరాజు, మాచర్ల గోపాల్, కోరిన్ని వెంకటేశ్వరరావు, నల్లమల సత్యనారాయణ, రాటకొండ పున్నయ్య, మురహరి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నేలకొండపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి గురువారం పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. కోరట్లగూడెంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మనోజ్, ప్రసాద్‌ల కుటుంబాలను, గువ్వలగూడెంలో ఇటీవల మృతి చెందిన గొగినేని పుల్లయ్య, నర్సయ్య కుటుంబాలను, అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య, శాఖమూరి సతీష్, రేణుబాబు, ప్రవీణ్, కనకప్రసాద్, ప్రసాద్, వంశీ, ఆదాం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం పాదయాత్ర




పాదయాత్రలో పాల్గొన్న నాయకులు

కూసుమంచి: ప్రజా సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే సీపీఎం ఆధ్వర్యాన పోరాటాలను ఉధృతం చేస్తామని పార్టీ పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ హెచ్చరించారు. మల్లేపల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పార్టీ ఆధ్వర్యాన గ్రామం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర చేపట్టి తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా, ప్రజా సమస్యలను పరిష్కరించలేని పరిస్థితుల్లో ఉందన్నారు. మల్లేపల్లి గ్రామంలో అర్హత ఉన్న 16 మంది లబ్ధిదారులకు కలెక్టర్ స్వయంగా డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పట్టాలు ఇచ్చారని, అయినా గ్రామంలో రాజకీయాలు చేస్తూ వారికి ఇళ్ల కేటాయించలేదన్నారు. యూరియా ఇవ్వకుండా రైతులను గోస పెడుతున్న ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, నాయకులు చీర్ల రాధాకృష్ణ, తాళ్లూరి రవి, మల్లెల సన్మంతరావు, ఎడవెల్లి రమణారెడ్డి, బిక్కసాని గంగాధర్, కర్ణబాబు, భారతి, సత్యనారాయణ, మధు పాల్గొన్నారు.


వైభవంగా అట్ల బతుకమ్మ..

బతుకమ్మ పండగను పురస్కరించుకుని ఐదవ రోజు గురువారం అట్ల బతుకమ్మ వేడుకలను మహిళలు వైభవంగా జరుపుకున్నారు. బతుకమ్మలను తీరొక్క పూలతో పేర్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆటపాటలతో సందడి చేసి సమీప చెరువులు, వాగులు, కాల్వల్లో నిమజ్జనం చేశారు.


– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంగాంధీచౌక్: వీడీవోస్ కాలనీలో..



రఘునాథపాలెం: మంచుకొండ ప్రాథమిక కేంద్రం వద్ద బతుకమ్మ వేడుకలు



ఖమ్మంగాంధీచౌక్: 56వ డివిజన్ షిర్డీసాయి మందిరంలో పూజలు చేస్తున్న మహిళలు